100కు ఫోన్‌కాల్..
నిలిచిన వివాహం

వధువు మైనర్ అంటూ.. సర్టిఫికెట్‌లో 18పైనే

పోలీసులతో మాట్లాడుతుండగా వధువుకు ఫిట్స్

పెళ్లి వద్దంటూ వెళ్లిపోయిన వరుడు 7లో



చెట్టులెక్కగలను.. చిగురు కోయగలను

ప్రమాదమని తెలిసినా ఉపాధి కోసం చిటారుకొమ్మన ఉన్న చింతచిగురు కోసేందుకు ఉపక్రమిస్తున్నారు గిరిజన మహిళలు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చిన్నగొట్టుముక్ల శివారులోని చింత చెట్టు ఎక్కి గిరిజన మహిళలు చిగురు కోస్తూ కనిపించారు. ప్రమాదమని తెలిసినా ఇలా పొట్టకూటి కోసం తప్పడం లేదని వారు వాపోయారు. రోజంతా సేకరించిన చింత చిగురు పట్టణంలో విక్రయిస్తే రూ.300 వస్తాయని వారు తెలిపారు.

- శివ్వంపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి)

కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలతో

నిరుపేదల కళ్లల్లో ఆనందం

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి
- సంగారెడ్డిలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి సోమవారం సంగారెడ్డిలోని కల్వకుంట, విద్యానగర్ కాలనీల్లోని రేషన్ దుకాణాల్లో ప్రారంభించారు. లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో అన్నివర్గాల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేస్తున్నామని స్పష్టం చేశారు. సంపన్న వర్గాల ప్రజలతో సమానంగా నిరుపేదలు కూడా సన్న బియ్యం తింటున్నారంటే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం నిర్మలా జగ్గారెడ్డిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.



నిర్మలా జగ్గారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కల్వకుంటలోని రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

బాలికతో వ్యభిచారం

పోక్సో కేసు నమోదు

వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

పోలీసుల కళ్లు గప్పి పారిపోయి.. అమ్మమ్మ చెంతకు చేరిన బాలిక

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికను గుర్తుతెలియని మహిళ వ్యభిచారం రొంపిలోకి దింపింది. హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో సదరు బాలికతో పనిచేయిస్తూ కొన్ని రోజులుగా వ్యభిచారం చేయిస్తోంది. హైదరాబాద్ లింగోజిగూడలోని ఓ ఎన్‌జీవో సభ్యులు ఈ విషయం తెలుసుకొని సదరు బాలికను మహిళ చెర నుంచి విడిపించారు. అనంతరం వారు ఈ నెల 4న పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. లైంగిక వేధింపులకు గురైనట్లు ఎన్‌జీవో సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో, పటాన్‌చెరు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి బాలికను అదేరోజు సంగారెడ్డిలోని సఖీ కేంద్రానికి తరలించారు. అయితే ఈ నెల 5, 6 తేదీల్లో ప్రభుత్వ సెలవులు కావడంతో 7న మధ్యాహ్నం వైద్య పరీక్షల నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఆసుపత్రిలో దరఖాస్తుఫారం నింపుతున్న క్రమంలో భయభ్రాంతులకు గురైన బాలిక పోలీసుల కళ్లుగప్పి ఆసుపత్రి నుంచి పారిపోయింది. వెంటనే అప్రమత్తమైన సంగారెడ్డి పట్టణ పోలీసులు ఆసుపత్రిలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సదరు బాలిక ఒక్కతే బయటకు వెళ్లిపోతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బాలిక కోసం పోలీసులు గాలింపు చర్యలు చేడుతున్న నేపథ్యంలో సోమవారం రాత్రికి సదరు బాలిక సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలంలోని ఓ గ్రామంలో ఉంటున్న తన అమ్మమ్మ ఇంటికి క్షేమంగా చేరుకుంది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పటాన్‌చెరు సీఐ వినాయక్‌రెడ్డి తెలిపారు. బాలికతో వ్యభిచారం చేయిస్తున్న మహిళ ఎవరనే విషయంపై పోలీసులు సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు.



పార్కింగ్.. ప్రాణ సంకటం

వ్యాపార సంస్థల వద్ద స్థలం కరువు

రోడ్లపైనే వినియోగదారుల వాహనాలు

వాహనదారులపైనే పోలీసుల ప్రతాపం

వ్యాపార సముదాయాలపై కొరవడిన చర్యలు

జహీరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం.. వ్యాపారసంస్థల లాభాపేక్ష వెరసి వాహనాదారులకు పార్కింగ్ ప్రాణసంకటంగా మారింది. వ్యాపార సముదాయాల ఎదుట పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపై నిలుపక తప్పటం లేదు. జహీరాబాద్ పట్టణంలో ప్రధాన రహదారులన్నీ పార్కింగ్ అడ్డాలుగా మారిపోయాయి. వ్యాపార సంస్థలు, వాణిజ్య సముదాయాలు, కర్మాగారాల వద్ద వాహనాల పార్కింగ్‌కు గజం స్థలం లేదు. దీంతో వినియోగదారులు రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. ఫలితంగా పట్టణవాసులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్‌కు చుట్టుపక్కల గ్రామాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక పరిధిలోని సరిహద్దు గ్రామాల ప్రజలు కూడా వివిధ అవసరాల నిమిత్తం వస్తుంటారు. నిత్యం వేలాది మంది వినియోగదారులతో రద్దీగా ఉండే వ్యాపార, వాణిజ్య సముదాయాలు కూడా సెట్ బ్యాక్, పార్కింగ్ స్థలం లేకుండానే దర్జాగా నిర్మించారు. ఆయా సంస్థలకు వచ్చేవారు రోడ్లపైనేవాహనాలను నిలుపాల్సి వస్తుంది. ట్రాఫిక్ రద్దీ కారణంగా పట్టణంలో పలుచోట్ల రహదారులపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు రోడ్లపై నిలిపిన వాహనదారులకు జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారు. కానీ, పార్కింగ్ ఏర్పాట్లు చేయని సంస్థలపై చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు.

అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తే చర్యలు



రోడ్లపై, రోడ్లకు ఇరుపక్కల అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యాపార సంస్థలు, కర్మాగారాలు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలి. ప్రజలకు ఇబ్బంది కలిగితే ఆయా సంస్థలపైనా చర్యలు తీసుకుంటాం. ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

- కాశీనాథ్, జహీరాబాద్ పట్టణ ఎస్ఐ

ప్రమాదాలు జరిగే స్థలాలివే..

జహీరాబాద్ పట్టణంలో ప్రధాన రోడ్డు 200 అడుగుల వెడల్పు ఉంటుంది. అయినా, రోడ్లపైనే చిరువ్యాపారాలు, వాహనాలు నిలుపడంతో ఇరుకుగా మారుతున్నాయి. సగం రోడ్డు వరకు వాహనాలను నిలుపడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. హుగ్గెల్లి చౌరస్తా, రంజోల్, ఘర్‌దాబా, పస్తాపూర్ చౌరస్తా, అల్లీపూర్ చౌరస్తా, ఇండస్ట్రియల్ ఏరియా చౌరస్తా, దత్తగిరికాలనీ చౌరస్తా, ఆచార్య కాలేజీ చౌరస్తా, కూరగాయల మార్కెట్, బస్టాండ్, బ్లాక్‌రోడ్ చౌరస్తా, సుభాష్‌గంజ్, భవానీ మందిర్‌రోడ్డు, కుమార్ హోటల్, తాండూర్ రోడ్డు చౌరస్తా, మొగుడంపల్లి చౌరస్తా, బీదర్ చౌరస్తా, అల్గోల్ రోడ్డు (డౌన్‌టౌన్), ముంగి కర్మాగారం, ఝరాసంగం రోడ్డు, ఆర్టీఏ ఆఫీసు, రాంనగర్‌చౌరస్తా తదితర ప్రాంతాల్లో రోడ్లపైనే వాహనాలు నిలుపడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా మార్గాల్లో వెళ్లే వాహనదారులు, ప్రజలు ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నారు. మొగుడంపల్లి వెళ్లే రోడ్డుపై ముంగి కర్మాగారం వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో కార్మికుల వాహనాలను రోడ్డు పక్కనే నిలుపుతున్నారు. ఇక్కడ మూలమలుపు ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనం కనిపించక పోవడంతో గతంలో ఆర్టీసీ బస్సు-ఆటో ఢీకొని 9 మంది మృతిచెందారు. ఇక్కడ ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి. బూచనెల్లి శివారులోని ఇండస్ట్రీయల్‌పార్కు వద్ద కర్మాగారాల ఎదుట రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేయడం సర్వసాధారణమైంది.

జోగినాథ

రథ చక్రాలు వస్తున్నాయ్..

జోగినాథ స్వామి రథోత్సవం సోమవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. జోగిపేట పట్టణం జన సంద్రమైంది. వీధులన్నీ విద్యుత్ తోరణాలతో వెలిగిపోయాయి. గౌని చౌరస్తా నుంచి రాత్రి 10 గంటల ప్రారంభమైన రథోత్సవం ప్రధాన వీధుల గుండా మంగళవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. మహిళలు అడుగడుగునా మంగళహారతులతో స్వాగం పలికారు.

వార్త 7వ పేజీలో



వన్యప్రాణులు విలవిల

- దాహార్తితో అడవిని వదిలి పొలాలు, జనావాసాల్లోకి
- ప్రమాదాలకుగురై మృత్యువాత
- రోడ్డు దాటుతూ ప్రమాదానికి గురైన చిరుత
- ఊరకుక్కల బారిన పడి జింక మృతి

మెదక్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మెతుకుసీమకు తలమానికమైన పోచారం అభయారణ్యం, తొనిగండ్ల అటవీ ప్రాంతాల నుంచి వన్యప్రాణులు దాహార్తి తట్టుకోలేక గ్రామాల్లోకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి. 4,500 హెక్టార్ల విస్తీర్ణంలో పోచారం అభయారణ్యం విస్తరించింది. లేళ్లు, దుప్పులు, చిరుతలు, ఎలుగుబంట్లు, కొండగొర్రెలు, అడవి కుక్కలు, దుప్పులు తదితర వణ్య ప్రాణులు ఇక్కడ ఉన్నాయి. పదిహేను రోజుల క్రితం నార్సింగి వద్ద జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న చిరుతను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. నాలుగు రోజుల క్రితం రామాయంపేట పరిధిలో జనవాసాల మధ్యకు వచ్చిన జింక ఊరకుక్కల దాడిలో చనిపోయింది. వన్యప్రాణులు, మృగాలు తాగునీటి కోసం అడవిని వదిలి బయటకు వస్తూ ప్రమాదాలకు గురవుతున్నాయి.

అడవుల్లో తాగునీరు కరువు


ఈసారి ఎండాకాలం ప్రారంభంలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. ఇప్పటికే 40 డిగ్రీల సెల్సీయస్ పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జలాశయాల్లో నీటిమట్టాలు అడుగంటాయి. అడవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి 570 సాసర్ పిట్లు ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కానీ, నీళ్లు లేక సాసర్‌పిట్లు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. పోచారం అభయారణ్యంలో సంచరించే వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో అక్కడక్కడా సాసర్‌పిట్లు ఏర్పాటు చేశారు. సోలార్ సాయంతో బోరు, నీటికుంటలు ఏర్పాటు చేశారు. ప్రతీ వారం ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చి సాసర్ పిట్లలో పోస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ప్రతీ వారం పదిహేను ట్రిప్పుల వరకూ 5వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకర్లతో సాసర్లలో నీరు నింపుతున్నామని చెప్పారు. అడవిలో మేతకు వెళ్లే గొర్రెలు పిట్లలో నీటిని తాగుతుండంతో అటవీ జంతువుల దాహం తీరడం లేదని పేర్కొంటున్నారు. పైగా తాగునీటి సౌకర్యాల కోసం రెండేళ్లుగా నిధుల కొరత నెలకొందని తెలిపారు. అటవీ శాఖ వద్ద ట్యాంకర్లు లేకపోవడంతో గ్రామ పంచాయతీలకు చెందిన ట్యాంకర్లను సర్దుబాటు చేయాలని కలెక్టర్‌ను అభ్యర్థించనట్లు ఫారెస్ట్ అధికారులు పేర్కొన్నారు. మూడు నెలలు ట్యాంకర్లను ఇస్తే వన్యప్రాణులకు సరిపడా నీరు అందించగలుతామని చెబుతున్నారు.



అడవిలో నీళ్లు లేని సాసర్‌పిట్

పోచారం అభయారణ్యంలో వన్యప్రాణుల గణన

జింకలు	1,500 - 2,000
దుప్పులు	500 - 600
నీల్‌గాయ్	100 - 150
ఎలుగుబంట్లు	20- 40
అడవి పందులు	5,000 - 8,000
చిరుత పులులు	25 - 30





ట్యాంకర్ల కోసం కలెక్టర్‌ను అభ్యర్థించాం

వన్యప్రాణులకు నీరందించేందుకు గ్రామపంచాయతీల ట్యాంకర్లు వినియోగించుకుంటామని కలెక్టర్‌ను అభ్యర్థించాం. త్వరలోనే అటవీ జంతువులకు తాగునీరు అందిస్తాం. జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో రహదారులపై అండర్‌గ్రౌండ్ పాస్‌లు ఏర్పాటు చేయాలని, వాహనాల వేగాన్ని నియంత్రించాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

-జోజో, డీఎఫ్‌వో, మెదక్

ఇలాగైతే వెళ్లేదెలా?

నాగులపల్లిలో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు

ఈదులనాగులపల్లి-వెలిమెల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం 7లో

ప్రమాదమని తెలిసినా ఓఆర్ఆర్ ర్యాంపు రోడ్డే దిక్కు

యాదగిరిగుట్టలా కేతకిని అభివృద్ధిచేస్తా..

జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్

సంగమేశ్వర ఆలయ చైర్మన్‌గా చంద్రశేఖర్ ప్రమాణ స్వీకారం 7లో









పండుటాకుల ప్రయాస

సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి'కి వృద్ధులు, దివ్యాంగులు తరలివచ్చి సమస్యలు పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. నడవలేని స్థితిలో ఉన్నవారు పార్కింగ్ నుంచి ప్రజావాణి హాల్ వరకు వెళ్లడానికి ఇబ్బందిపడ్డారు. అటువంటివారిని వెంట వచ్చిన సంరక్షకులు చేతులపై మోసుకుంటూ వెళ్లడం కనిపించింది.

- సంగారెడ్డి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)

సంగారెడ్డిలో దొంగల హల్‌చల్

- వ్యాపార కేంద్రాలే లక్ష్యంగా చోరీలు
- 20 రోజుల్లో ఆరు దుకాణాల్లో నగదు అపహరణ
- తాజాగా రైస్‌మిల్లులో రూ.2 లక్షలు
- మెడికల్‌షాపులో రూ.50 వేలు చోరీ

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. వ్యాపారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. రాత్రి సమయాల్లో మూసి ఉంచిన వ్యాపార దుకాణాలనే లక్ష్యంగా చేసుకుని దోచుకెళ్తున్నారు. ఎక్కువగా పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలే ఎంచుకుంటున్నారు. నిత్యం పోలీస్ పెట్రోలింగ్, సీసీ కెమెరాల నిఘా ఉండే జిల్లా కేంద్రంలోనే 20 రోజులుగా ఆరు చోట్ల దొంగతనాలకు పాల్పడినా పోలీసులు నిందితులను పట్టుకోవడంలో విఫలమయ్యారు. నిఘా వ్యవస్థ నిద్రపోతుందా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తాజాగా ఆదివారం రాత్రి ఐబీ ఎదురుగా ఉన్న సంతోష్ మెడికల్ దుకాణాలో చోరీ జరిగింది. మెడికల్ షాప్ షట్టర్‌ను పగులగొట్టి లోపలికి చొరబడిన దొంగలు రూ.50వేల నగదును అపహరించారు. అలాగే శిల్పారామం సమీపంలో ఉన్న రాజయ్య రైస్ మిల్లులో రూ.2లక్షల నగదు దోచుకెళ్లారు.

నిఘా వ్యవస్థ ఏం చేస్తుంది?

సంగారెడ్డి పట్టణంలోనే 20 రోజులుగా వ్యాపార కేంద్రాల్లో దొంగతనాలు జరుగుతున్నా నిఘా వ్యవస్థ ఏం చేస్తుందని వ్యాపారులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణ ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాల్లో చోరీలు జరుగుతుంటే పోలీసులు ఇంకా దొంగలను పట్టుకోకపోవడం చూస్తుంటే వారి నిఘా వ్యవస్థ ఏం చేస్తుందని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వరుసగా దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు అప్రమత్తత చర్యలేమి కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దొంగల దృశ్యాలు సీసీ కెమెరాల్లో స్పష్టంగా కనిపిస్తున్నా పట్టుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శిస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే నిఘా విభాగం ఇంత ఘోరంగా విఫలమైతే మారుమూల గ్రామాల పరిస్థితి ఏంటని అంటున్నారు. దుకాణాలకు తాళం వేసి ఇంటికి వెళ్లాలంటేనే జంకుతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి వ్యాపార కేంద్రాలనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడే దొంగలను పట్టుకోవాలని వ్యాపారవర్గాలు పోలీసులను కోరుతున్నారు.

సరాఫ్‌పల్లిలో తాళం పగులగొట్టి ఓ ఇంట్లో చోరీ

బంగారం, వెండి, నగదు అపహరణ



బీరువాలోని బట్టలను చిందరవందరగా పడవేసిన దుండగులు

పుల్‌కల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు చొరబడి బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పుల్కల్ ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సరాఫ్‌పల్లి గ్రామానికి చెందిన వంజరి స్వాతికి చెందిన ఇంట్లో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సంతోష్ భార్య పిల్లలతో కలిసి అద్దెకు ఉంటున్నారు. కుటుంబ సభ్యులందరూ ఆదివారం సాయంత్రం హత్నూర మండలం మాదారం దత్తాత్రేయ స్వామి ఆలయానికి దైవదర్శనానికి వెళ్లారు. రాత్రి అక్కడే బస చేసిన సంతోష్ సోమవారం ఉదయం 6.30 గంటలకు ఇంటికి వచ్చారు. తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా ధ్వంసం చేసి కనపడింది. బీరువాలో దాచి ఉంచిన తులం బంగారం నగలు, 20 తులాల వెండి పట్టీలు, రూ.20 వేలు నగదును ఎత్తుకు వెళ్లారు. బాధితుల సమాచారంతో అక్కడకు చేరుకున్న ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంగారెడ్డి నుంచి క్లూస్ టీంను రప్పించి, ఆధారాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని కామారం తండా రైల్వేగేటు సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్నది. కామారెడ్డి రైల్వే పోలీసుల వివరాలు తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మర్చ్యూరీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని రైల్వే పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ హనుమాండ్లుగౌడ్ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్‌లోని చైతన్యపురికాలనీలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణ పరిధిలోని చైతన్యపురిలో నివసించే ఎం.వెంకటేశ్(45) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్య తాగుడుకు బానిసవడంతో తరచూ కుటుంబీకులతో గొడవపడుతూ ఉండేవాడు. ఆదివారం రాత్రి బాగా మద్యం సేవించి కుటుంబీకులతో గొడవ పడ్డాడు. కుటుంబీకులు తాగిన మత్తులో ఉన్న వెంకటేశ్‌కు నచ్చచెప్పి పడుకోబెట్టారు. సోమవారం తెల్లవారుజామున ఆరు గంటల ప్రాంతంలో గదిలోకి వెళ్లిచూడగా ఇంట్లో తాడుతో ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. భార్య సంతోష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్స్‌తో యువకుడి మృతి

నర్సాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడికి ఫిట్స్ రావడంతో పొలంలోనే మృతిచెందిన సంఘటన నర్సాపూర్ మండలం రుస్తుంపేటలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. రుస్తుంపేటకు చెందిన కర్రె కిష్టయ్య కొడుకు అనిల్(26) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు తరచూ వచ్చే ఫిట్స్‌తో కొన్నిరోజులుగా బాధపడుతున్నాడు. 5వ తేదీన కూలి పని కోసమని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. సాయంత్రం అయినా అనిల్ ఇంటికి రాలేదు. మరుసటి రోజు కూడా కనిపించకపోవడంతో అంతటా వెతుకుతుండగా సాయంత్రం గ్రామ శివారులోని పొలంలో ఫిట్స్‌తో పడిపోయి చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్టు

నగదు, రెండు బైకులు స్వాధీనం



అరెస్టు చేసిన ఐదుగురు నిందితులను చూపుతున్న పోలీసులు

ములుగు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు యువకులను సోమవారం కొట్యాల గ్రామంలో పోలీసులు అరెస్ట్ చేశారు. ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొట్యాల శివారులో యువకులు గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమై అక్కడికి చేరుకున్నారు. ఐదుగురిని పట్టుకొని వారి వద్ద నుంచి 920 గ్రాముల గంజాయి, రూ.33 వేలు, 2 ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఐదుగురు నిందితులను రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

120 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

పోలీసుల అదుపులో ఇద్దరు



పోలీసులు అదుపులో ఎండు గంజాయిని రవాణా చేస్తున్న నిందితులు

మునిపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి హైదరాబాద్‌కు ద్విచక్రవాహనంపై తీసుకెళ్తున్న 120 గ్రాముల ఎండు గంజాయిని సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ వైపు నుంచి హైదరాబాద్‌కు స్కూటీపై రవాణా చేస్తున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం తెలిసింది. దీంతో కంకోల్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో స్కూటీపై వెళ్తున్న ఇద్దరిపై అనుమానం రావడంతో వారిని ఆపి తనిఖీ చేయగా అందులో 120 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. నిందితులు మహ్మద్ ఆయూబ్ అలీ, షేక్ సమీర్‌ను విచారించగా బీదర్‌కు చెందిన ఇర్ఫాన్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపారు.

100కు ఫోన్‌కాల్.. నిలిచిన వివాహం

● వధువు మైనర్ అంటూ గుర్తుతెలియని వ్యక్తుల ఫిర్యాదు
● పోలీసులతో మాట్లాడుతుండగా వధువుకు ఫిట్స్
● పెళ్లి వద్దంటూ వెళ్లిపోయిన వరుడు

కల్హేర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల వారు వచ్చారు. విందు భోజనాలు సిద్ధమయ్యాయి. మరికాసేపట్లో వధూవరులు పెళ్లి పీటలు ఎక్కడమే తరువాయి.. ఇంతలోనే పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో సీన్ మారిపోయింది. పోలీసుల గండం గట్టెక్కిందనుకునే సమయంలో వరుడు ససేమిరా అనడంతో వివాహం కాస్త ఆగిపోయింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. మండలంలోని ఓ తండాకు చెందిన యువతితో సిర్గాపూర్ మండల పరిధిలోని మరో తండాకు చెందిన యువకుడితో వివాహం జరిపించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మరికొన్ని గంటల్లో వివాహం జరగనుండగా, గుర్తు తెలియని వ్యక్తులు 100 నంబర్‌కు కాల్ చేసి మైనర్‌కు వివాహం చేస్తున్నారని చెప్పారు. దీంతో కల్హేర్ పోలీసులు ఆదివారం రాత్రి తండాకు వచ్చి వివరాలు సేకరించారు. అయినా, కుటుంబ సభ్యులు వివాహం చేసేందుకు సిద్ధం కాగా, మరోసారి పోలీసులకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో పోలీసులు వచ్చి వధువు పదో తరగతి సర్టిఫికెట్ పరిశీలించగా, అందులో ఆమె వయస్సు 18 ఏళ్లపై బడి ఉంది. దీంతో పోలీసులు వధువుకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించే క్రమంలో ఆమెకు పూనకం వచ్చినట్లు ఊగిపోవడంతో పాటు కళ్లు తిరిగి పడిపోయింది. దీంతో వరుడితో పాటు అతని బంధువులు పెళ్లి వద్దంటూ వెళ్లిపోయారు. దీంతో వధువు తరఫు కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.

మహిళా శక్తికి సాంకేతికత తోడైతే సమాజాభివృద్ధి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మహిళా శక్తికి సాంకేతికత తోడైతే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో హెటిరో, సింక్రో ఫ్లయింగ్ వెడ్జ్ పరిశ్రమల ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. టెక్నాలజీ పరంగా అవగాహన కలిగి ఉంటే మహిళలకు, స్వయం సంఘాల సభ్యులకు సాధికారత కల్పించవచ్చన్నారు. వ్యవసాయ, ఉద్యాన సేవల కోసం డ్రోన్‌లు అందజేయాలన్నారు. దీని ద్వారా ఆర్థిక సాధికారిత, స్థిరమైన జీవనోపాధికి దోహదపడుతుందని కలెక్టర్ ఆకాంక్షించారు. డ్రోన్ శిక్షణను రాష్ట్ర స్థాయిలో మొదటిసారి సంగారెడ్డి జిల్లాలోనే ప్రారంభించుకున్నామన్నారు. ఈ శిక్షణను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మహిళలకు డ్రోన్‌ల కోసం బ్యాంకుల నుంచి లేదా శ్రీనిధి ద్వారా రుణాలు అందించి ప్రోత్సహించాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో జ్యోతి, అదనపు డీఆర్డీవో జంగారెడ్డి, హెటిరో, సింక్రో సర్వీస్, ఎరోస్పేస్ ప్రతినిధులు సుధాకర్, నరసింహా, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అనంతసాగర్ రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

రోడ్లపైనే కల్లాలు

వ్యవసాయాధికారులు, పోలీసుశాఖ ఎన్ని చర్యలు తీసుకున్నా యాసంగి వరి ధాన్యం రోడ్లపైకి రానే వచ్చింది. మండలంలోని మక్కరాజుపేట, రుక్మాపూర్ అనంతసాగర్, బోనాల, కర్నాల్‌పల్లి నుంచి దౌల్తాబాద్ వరకు రోడ్లపైనే కల్లాల ఏర్పాటుతో గతంలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు మండలంలోని రైతులకు మూడు నెలల ముందే రైతు వేదికల్లో అవగాహన కల్పించారు. అయినా, రైతులు యథావిధిగా రోడ్లపైనే వడ్లను ఆరబెడుతున్నారు.

చేగుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి)

ఇలాగైతే వెళ్లేదెలా?

నాగులపల్లిలో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు

ఈదులనాగులపల్లి - వెలిమెల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం

ప్రమాదకరంగా ఉన్న ఓఆర్ఆర్ ర్యాంపు రోడ్డే దిక్కు


నాగులపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి

రామచంద్రాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఈదులనాగులపల్లి నుంచి పటాన్‌చెరు వెళ్లే మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. దీంతో కొన్నిరోజులుగా ఈ మార్గంలో రాకపోకలకు స్థానికులకు తలనొప్పులు తప్పడం లేదు. ఈ బ్రిడ్జి పనుల కారణంగా మార్చి 8న ఈ ప్రాంతంలోని రైల్వే గేట్‌ను కూడా మూసి వేశారు. మొదటగా పది రోజుల పాటు మాత్రమే మూసివేస్తామంటూ రైల్వే అధికారులు చెప్పగా, నెల రోజులవుతున్నా తెరవడంలేదు. పక్క గ్రామమైన వెలిమెల నుంచి పటాన్‌చెరు వెళ్లడానికి కష్టాలు తప్పడం లేదు. వాహనాలు వెళ్లేందుకు ఓఆర్ఆర్ నాగులపల్లి వద్ద ఉన్న ర్యాంప్ రోడ్డే దిక్కుగా మారింది. గతుకులతో ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డుపైనే వెళ్లక తప్పకపోవడంతో వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని హడలెత్తిపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఒకే ర్యాంపు రోడ్డు ఉండగా, రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది.


గతుకులమయంగా ఓఆర్ఆర్ ర్యాంప్ రోడ్డు

కొల్లూరుకు బస్సు బంద్



రైల్వే గేట్‌ను మూసివేయడంతో విద్యార్థులు, ఉద్యోగులు, స్థానికులు రోడ్డు వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొల్లూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సులు రావడం లేదు. పరిస్థితి తీవ్రత అధికారులకు అర్థమవ్వడం లేదు.

- ప్రవీణ్, వెలిమెల

ర్యాంపు రోడ్డుపై ప్రయాణం నరకమే



ఓఆర్ఆర్ ర్యాంపు రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. రెండు వాహనాలు ఒకేసారి ర్యాంపుపైకి చేరుకుంటే ట్రాఫిక్ జాం అవుతుంది. మట్టి జారీ ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి.

- దయాకర్, వెలిమెల

భారీ ర్యాలీతో ప్రమాణస్వీకారానికి

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి విజయం సాధించిన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురానికి చెందిన చిన్నమైల్ అంజిరెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రామచంద్రాపురం పట్టణం నుంచి భారీ ఎత్తున బీజేపీ కార్యకర్తలతో నగరంలోని అసెంబ్లీకి తరలివెళ్లారు. గన్‌పార్క్ వద్ద నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఆకాంక్షలకు అనుగుణంగా శాసనమండలిలో వ్యవహరిస్తానని తెలిపారు. ఆయనతో పాటు సతీమణి, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి, నాయకులు తదితరులు ఉన్నారు. అంజిరెడ్డికి కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీలు రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, మాజీ ఎంపీ బీబీ పాటిల్ శుభాకాంక్షలు తెలిపారు.


గన్‌పార్క్ వద్ద నినాదాలు చేస్తున్న అంజిరెడ్డి, బీజేపీ నాయకులు

యాదగిరిగుట్టలా కేతకీని అభివృద్ధి చేస్తా

● జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్
● సంగమేశ్వర ఆలయ చైర్మన్‌గా చంద్రశేఖర్ ప్రమాణ స్వీకారం



కేతకీలో ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ, సంవిధాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్

ఝరాసంగం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట తరహాలో కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ అర్చకులు ఎంపీకి వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మొదట ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్‌గా చంద్రశేఖర్, 11 మంది కమిటీ సభ్యులతో దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ శివరాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ మాట్లాడుతూ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ ఆలయానికి రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారన్నారు. ఆలయాభివృద్ధికి, భక్తులకు సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని నూతన కమిటీకి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, జడ్పీ మాజీ చైర్మన్ సునితాపాటిల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంతురావు పాటిల్, ఆలయ ఈవో శివ రుద్రప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత అందరిదీ

నారాయణఖేడ్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరుతో ప్రమాదంలో పడ్డ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పైడిపల్లిలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్‌లో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలు, కులాలకు చెందిన పార్టీ అన్నారు. స్వాతంత్య్రం కోసం పోరాడిన, రాజ్యాంగాన్ని రచించిన మహాత్ములపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌తో పాటు ఆయన రచించిన రాజ్యాంగంపై చేసిన ఆరోపణలే అందుకు నిదర్శనమన్నారు. జగన్నాథ్‌పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఖేడ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ధనలక్ష్మి, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాకేష్‌షెట్కార్, తాహేర్ అలీ, వినోద్‌పాటిల్, రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

● పిస్టల్, 35 బుల్లెట్లు, ద్విచక్రవాహనం స్వాధీనం
● గజ్వేల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచిన పోలీసులు


నిందితులను, స్వాధీనం చేసుకున్న పిస్టల్, బుల్లెట్లను చూపుతున్న గౌరారం పోలీసులు

వర్గల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులు శ్రీరామనవమి ఉత్సవాల బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా, గౌరారం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి పిస్టల్‌తో పాటు బుల్లెట్లు, ద్విచక్రవాహనం, పలు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం నాస్కల్ గ్రామం, ప్రస్తుతం బాలాజీనగర్‌లో నివాసముంటున్న మహ్మద్ ఎంతీజాజ్(22), సికింద్రాబాద్‌లోని నెరేడ్‌మెట్ ప్రాంతంలో నివాసముంటున్న మహ్మద్ హిదాయత్ అలీ, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాలాజీనగర్‌కు చెందిన మద్దూర్ లాలు వీరు ముగ్గురు ఒక గ్రూపుగా ఏర్పాటై చోరీలకు పాల్పడటానికి పన్నాగం పన్నుతున్నారు. కాగా, ఆదివారం రాత్రి 8.00 గంటల ప్రాంతంలో వర్గల్ గ్రామంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. శ్రీరామనవమి బందోబస్తు నిర్వహిస్తున్న గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి, పోలీసు సిబ్బందిని చూసి వారు పారిపోయే ప్రయత్నం చేయడంతో వెంట పడి పట్టుకున్నారు. మహ్మద్ ఎంతీజాజ్, మహ్మద్ హిదాయత్ వారి వద్ద ఉన్న బ్లాక్ కలర్ బ్యాగ్‌ను తనిఖీ చేయడంతో అందులో ఒక పిస్టల్, 35 బుల్లెట్లు, రెండు మొబైల్‌ఫోన్‌లు, నిజమైన ఆధార్‌కార్డులు, నకిలీ ఆధార్‌కార్డులు, డెబిట్ కార్డులు, మెమొరీ కార్డులు, ఎయిర్‌టెల్ సిమ్ కార్డులు, నకిలీ దస్తర్లు, పెప్పర్ స్ప్రే నాలుగు బాటిళ్లు లభించాయి. ఇద్దరు వ్యక్తులను పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లి విచారించగా ఎంతీజాజ్, మద్దూర్ లాల్ వీరు ఇద్దరు ఆస్తి నేరాలు, చైన్‌స్నాచింగ్, దోపిడీ, బైక్‌ల దొంగతనాలకు పాల్పడటానికి కుట్రలు చేశారని తెలిపారు. వీరు ఇద్దరు బీహార్ రాష్ట్రంలోని ముంగర్ పట్టణానికి వెళ్లి పిస్టోల్, 38 బుల్లెట్లు కొనుగోలు చేశారని, అందులో జవహర్‌నగర్ అడవి ప్రాంతంలో ఒక రౌండ్ షూటింగ్ ప్రాక్టీస్ చేసినట్లు తెలిపారు. ఈ నెల 2 నుంచి 5 వరకు ఎంతీజాజ్, హిదాయత్ అలీ సికింద్రాబాద్‌లోని హోటల్ సుప్రభాత్‌లో ఉండి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆస్తి నేరాలు చేయడానికి ప్రయత్నించినట్లు తెలిపారు. ఆదివారం వీరిద్దరు దోపిడీ చేయడం కోసం వర్గల్ గ్రామానికి రాగా పట్టుబడ్డారు. మూడో వ్యక్తి మద్దూర్ లాలును బాలాజీనగర్ ఆర్మీ డెంటల్ కాళాశాల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం గజ్వేల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.



బెజ్జంకి జాతర పండుగొచ్చే..


వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఏకశిల గుట్ట.. నేడు లక్ష్మీనర్సింహుడి కల్యాణం


కాకతీయుల కాలంలో నిర్మించిన లక్ష్మీనృసింహుడి ఆలయంలోని స్తంభాలు

బెజ్జంకి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకిలో ఏకశిల గుట్టపై లక్ష్మీసమేతుడుగా కొలువుదీరిన నృసింహస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. చైత్రశుద్ధ సప్తమి నుంచి బహుళ సప్తమి వరకు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. కాకతీయుల కాలంలో రాతి కట్టడంతో నిర్మించిన ఈ ఆలయంలో స్వామివారు దక్షిణ ముఖంగా స్వయంభుగా వెలిశారు. సంతానం లేని వారికి గుట్టపైన ఉన్న ఆండాల్ రాతి స్తంభానికి ఒడిబియ్యం పోసి, ముడుపు కడితే సంతానం కల్గుతుందని భక్తుల నమ్మకం. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన శ్రీలక్ష్మీసమేత నృసింహ స్వామి వారి తిరు కల్యాణోత్సవ్వాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఏకశిల గుట్ట చుట్టూ తిరిగే ఎడ్లబండ్ల ఊరేగింపు (శకటోత్సవం) 12న, చివరి ప్రధాన ఘట్టమైన రథోత్సవ వేడుకలు 13న కొనసాగనున్నాయి.

కనులపండువగా జోగినాథుని రథోత్సవం

జోగిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట పట్టణంలో సోమవారం రాత్రి జోగినాథస్వామి రథోత్సవం కనులపండుగగా నిర్వహించారు. రాత్రి 10 గంటల సమయానికి ఆలయ కమిటీ చైర్మన్ డాకూరి శివశంకర్‌తో అర్చకులు భద్రయ్య స్వామి, సుజీత్ ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి, హారతినిచ్చి ప్రారంభింపజేశారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం పూజారులు రథం ముందు పట్నం ముగ్గు వేసి అన్నరతి పెట్టారు. వివిధ కులవృత్తుల వారితో కార్యక్రమాలు జరిపించారు. జంగమ పూజారులైన సోమప్పస్వామి, సుజీత్‌స్వామి తదితరులు రాగయుక్తంగా ఆడుతూ, వీరన్న ప్రస్థాయం గానం చేశారు. జోగినాథస్వామికి జై, ఓంనమఃశివాయ, హరహరమహాదేవ అంటూ వేలాదిమంది భక్తులు రథాన్ని తాళ్లతో లాగారు. గౌనిచౌరస్తా నుంచి ప్రారంభమైన రథం పోచమ్మ ఆలయం, పోచమ్మ వీధుల గుండా జోగినాథ కూడలి వద్దకు చేరుకునే సరికి అర్ధరాత్రి దాటింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రథత్సవ కమిటీ సభ్యులు మాజీ ఎంపీపీ హెచ్.రామాగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ డీబీ. నాగభూషణం, మాజీ ఎంపీటీసీ శివశేఖర్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


విద్యుత్‌కాంతులలో రథం


నర్మెట్ట గ్రామంలో ఖాళీ స్థలంలో క్రికెట్ ఆడుతున్న యువకులు

ప్రైవేటు స్థలమే క్రీడా మైదానం

గ్రామాల్లో అలంకారప్రాయంగా ప్రభుత్వ క్రీడా మైదానాలు

నంగునూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు అలంకారప్రాయంగా మారాయి. కనీస సౌకర్యాలు కల్పించలేదు. ఈ క్రీడా మైదానాలను కొన్నిచోట్ల ఊరికి దూరంగా మరికొన్ని చోట్ల శ్మశానవాటికల పక్కనే ఏర్పాటు చేయడంతో అటువైపు యువత కన్నెత్తి చూడడం లేదు. మరికొన్ని గ్రామాల్లో గుట్టలు, రాళ్ల మధ్య ఏర్పాటు చేశారు. దీంతో క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని గ్రామాల్లో క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువత ప్రైవేటు ప్లాట్లు, భూములను మైదానాలుగా మార్చుకొని ఆడుకుంటున్నారు. గ్రామాల్లో పండుగలు, సెలవులు వచ్చిందంటే ఊరి బయటకు వెళ్లి ఖాళీ స్థలం ఎక్కడ ఉంటే అక్కడ వికెట్లు పెట్టుకొని క్రికెట్ ఆడడం ప్రతీ గ్రామంలో కనిపిస్తుంది. నాలుగైదు గ్రామాల క్రీడాకారులు ఒక దగ్గర చేరి క్రికెట్ మ్యాచ్‌లు ఆడుతున్నారు. తుమ్మ చెట్లు, పొదలు, చెత్త పేరుకుపోయిన క్రీడా మైదానాలను చదును చేయించి కనీస వసతులు కల్పించాలని యువత కోరుతున్నారు.

ప్రోత్సహిస్తే రాణిస్తాం



క్రీడాకారులను ప్రోత్సహించి కనీస వసతులు కల్పిస్తే రాణిస్తాం. కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల టాలెంట్ ఉన్నప్పటికీ గుర్తింపు పొందలేకపోతున్నాం. ప్రభుత్వం గ్రామీణ క్రీడలను ప్రోత్సహించి క్రీడాకారులను గుర్తించాలి.

- మోతకని శేఖర్, నర్మెట్ట

ఐఐటీహెచ్‌ను సందర్శించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

కంది, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆరుట్ల, ఉత్తర్ పల్లి ఎర్దనూరు, ముక్తాఅల్లూరు, జుల్‌కల్, కవలంపేట గ్రామాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు సోమవారం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌ను సందర్శించారు. ఐఐటీహెచ్‌లోని డీఏవీ స్కూల్‌లో విద్యార్థులకు చెబుతున్న డిజిటల్ తరగతులపై విధానంపై అక్కడి అధ్యాపకులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ఆ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, తరగతిగదులను పరిశీలించారు. అలాగే ఐఐటీహెచ్‌లో నూతన రీసెర్చ్ భవనాలను, పరిసరాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ జోగప్ప. ఐఐటీహెచ్ అధ్యాపకులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

● మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు



నిజాంపేట: ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రావు

నిజాంపేట/ మెదక్ కల్చరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించి మద్దతు ధర పొందాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. నిజాంపేట మండల పరిధిలోని వెంకటాపూర్ కే, మెదక్ మండల పరిధిలోని పాతూరు గ్రామాల్లో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదలు కడుపునిండా భోజనం చేయాలన్న ఉద్దేశంతో రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సన్నరకం వరి ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ శ్రీనివాసరావు, ఏవో సోమలింగారెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ రమ్యశ్రీ, ఎంపీడీవో రాజిరెడ్డి, మెదక్ ఎమ్మార్వో లక్ష్మణ్ బాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ మొల్సాబ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ చౌదరి, మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు అమర్ సేనారెడ్డి, ముత్యంరెడ్డి సత్యనారాయణరెడ్డి, మహేందర్, నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాలుగా చెరువులు

● పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



రామచంద్రాపురం : ముత్తంగి చెరువు వద్ద మినీ ట్యాంక్‌బండ్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రామచంద్రాపురం టౌన్/పటాన్‌చెరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక కేంద్రాలుగా చెరువులను తీర్చిదిద్దుతున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామం ఎంక చెరువును రూ.7.35 కోట్ల అంచనా వ్యయంతో మినీట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దే పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. అలాగే జీహెచ్‌ఎంసీ పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని తిమ్మక్క చెరువును సుందరీకరణ పనులకు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న చెరువులను మినీట్యాంక్‌బండ్‌లుగా మారుస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ చెరువుల విభాగం డీఈ రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు ఉపేందర్, దశరథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, మున్సిపల్ ఉపాధ్యక్షుడు రాములుగౌడ్, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సిల్వర్ శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, హెచ్‌ఎండీఏ చెరువుల విభాగం డీఈ రామకృష్ణ, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపడమే లక్ష్యం

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నాగల్‌గిద్ద మండలం దామర్‌గిద్దలో లబ్ధిదారుడి ఇంట్లో సన్నబియ్యం భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్ /నాగల్‌గిద్ద/ కల్హేర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పేదల కడుపు నింపేందుకే ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ మండలం రుద్రారం, పైడిపల్లి, పంచగామ, తదితర గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం నారాయణఖేడ్ జడ్పీ పాఠశాల ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్లోబల్ ల్యాబ్ సహకారంతో నిర్వహించిన ఉచిత రక్తనమూనాల కార్యక్రమానికి హాజరయ్యారు. పట్టణ శివారులోని పద్మశాలీకాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే నాగల్‌గిద్ద మండల పరిధిలోని దామర్‌గిద్ద గ్రామంలోని దళితవాడల్లో సన్నబియ్యం లబ్ధిదారుడైన వైజ్యనాథ్ ఇంట్లో భోజనం చేశారు. కల్హేర్ మండల పరిధిలోని క్రిష్ణాపూర్, కల్హేర్, మార్డి గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ, జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు అంబలి పంపిణీ

నారాయణఖేడ్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అనంత్‌సాగర్‌లో సోమవారం ఉపాధిహామీ కూలీలకు అంబలిని పంపిణీ చేశారు.





ఇది రోడ్డేనా?

● ఐదు కిలోమీటర్లు ఇదే పరిస్థితి
● కంకర తేలి అధ్వానంగా మారిన నాగిరెడ్డిపల్లి-పోతిరెడ్డిపల్లి లింక్ రోడ్డు

కోహీర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లి-పోతిరెడ్డిపల్లి గ్రామాల మధ్య ఉన్న లింకు రోడ్డు కంకర తేలి పూర్తిగా అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు పాడై సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు కనీసం మరమ్మతులు చేయడం లేదు. ఐదు కిలోమీటర్ల పొడవునా దారి ఇలానే ఉండడంతో వాహనదారులు, పొలాలకు వెళ్లే రైతులు నరకయాతన పడుతున్నారు. ఈ రోడ్డును 15 సంవత్సరాల క్రితం నిర్మించి నిర్వహణ గాలికొదిలేశారు. ఇది నల్లరేగడి భూమి కావడంతో రోడ్డు కిందికి దిగబడిపోయి కంకర మొత్తం పైకి తేలడంతో అసలిది రోడ్డనే ఆనవాళ్లు లేకుండా మారింది. రాత్రి వేళల్లో ఈ దారి గుండా వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదులను పరిష్కరించండి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ● ప్రజావాణిలో 65 ఆర్జీలు



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఆర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని సంబంధిత అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించారు. మొత్తం 65 ఆర్జీలు అందాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌వో పద్మజరాణి, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో డా. గాయత్రి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెదక్‌లో ప్రజావాణికి 95 వినతులు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 95 ఆర్జీలు అందాయి. ఇందులో భూ సమస్యలు 38, ధరణి 9, పింఛన్ 5, ఇతర సమస్యలకు సంబంధించినవి 43 ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగరావు, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు.

ఇంటర్ ఫలితాల విడుదలకు సన్నాహాలు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ● మూల్యాంకన కేంద్రం పరిశీలన

మెదక్ అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రాన్ని సోమవారం మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. సెంటర్‌లోని మౌలిక వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దాదాపు 690 అధ్యాపకులు ప్రక్రియలో పాల్గొని ఒక లక్ష 87 వేల జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారన్నారు. ఆర్థిక శాస్త్రంతో మూల్యాంకనం ముగిసిందన్నారు. రీకౌంటింగ్, రీవాల్యూయేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. త్వరలో ఇంటర్ ఫలితాలను విడుదల చేసేందుకు బోర్డు సన్నాహాలు చేస్తోందని కలెక్టర్ వివరించారు. అలాగే సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయన మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రకియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం

కొల్చారం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్‌లో సోమవారం మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సన్నబియ్యం పథకం లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం సన్నబియ్యం లబ్ధిదారు దుర్గరాజు ఇంట్లో భోజనం చేశారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య తదితరులు ఉన్నారు.



వ్యక్తి అదృశ్యం



సంతోష్ కుమార్ (ఫైల్)

చిలప్‌చెడ్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలం పరిధిలోని బట్టు తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన కేతావత్ సంతోష్ కుమార్‌కు సామ్లా తండాకు చెందిన వసంతతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి పాప, బాబు సంతానం. ఈ దంపతుల మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 6న మరోసారి గొడవ జరగడంతో సంతోష్‌కుమార్ ఇంట్లో నుంచి బయటికెళ్లి తిరిగి రాలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని భార్య కెతావత్ వసంత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

చేగుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ అహ్మద్ మోహినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం వెల్దుర్తి మండలం బండ్ల పోచంపల్లి గ్రామానికి చెందిన తుపాకుల విఠల్‌కు ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురు మౌనిక(30)ను నార్సింగి మండలం వల్లూరు గ్రామానికి చెందిన విఠల్ అక్క లక్ష్మి కొడుకు దొడ్ల సురేష్‌తో తొమ్మిదేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు కూతుర్లు, కొడుకు సంతానం. రెండు నెలల క్రితం తన చిన్న కూతురు లావణ్యకు వివాహం చేసి ఐదు తులాల బంగారంతో పాటు ఎకరా పొలం కానుకగా ఇచ్చాడు. అప్పటి నుంచి పెద్ద కూతురు మౌనిక, ఆమె భర్త సురేష్ మధ్య తరచు గొడవలు జరుగుతున్నాయి. దానికి తోడు మౌనిక ఐ.టీ.సీ కంపనీలో ఉద్యోగం చేస్తుండడంతో అంత దూరం ఉద్యోగం ఎందుకని, ఇక్కడే ఏదైనా పని చేసుకుంటూ పిల్లలను చూసుకోమని భర్త చెప్పాడు. దీంతో మనస్తాపం చెందిన మౌనిక సోమవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సైన్స్ మ్యూజియం సందర్శన

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని సీవీ రామన్ సైన్స్ మ్యూజియంను సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ మాధురి తన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ మ్యూజియంలో విజ్ఞానం, జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం, గణితం, ఫన్, ఎలక్ట్రానిక్స్ వివిధ రంగాల శాస్త్రవేత్తలకు సంబంధించిన వివరాలు పొందుపర్చడంతో పిల్లలకు జ్ఞానం పెరుగుతుందన్నారు. మ్యూజియంను సందర్శించే పాఠశాలలు ముందుగా జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డిని సంప్రదించాలని సూచించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● అదనపు డీఆర్డీవో సరస్వతి

మనోహరాబాద్ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహిళ సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగాలని అదనపు డీఆర్డీవో సరస్వతి అన్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో సోమవారం మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిరాణాషాపును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘాలలోని పేద, నిరుపేద సభ్యులందూ శ్రీనిధి, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని వ్యాపారం ఏర్పాటు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు, ఏపీఎం పెంటాగౌడ్, వివోఏలు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

● మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

వెల్దుర్తి, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. సోమవారం వెల్దుర్తి పీఎంశ్రీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో యాదగిరి, వెల్దుర్తి పీఎంశ్రీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సాంబయ్య, కుకునూర్ పాఠశాల హెచ్‌ఎం సీతారామ్ పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్ భవనం ప్రారంభం

● రూ.27 లక్షలతో నిర్మించిన సెహగల్ సంస్థ

రామాయంపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల భవనం శిథిలమవగా.. సెహగల్ సంస్థ నూతన భవనాన్ని నిర్మించింది. ఈ మేరకు సోమవారం సంస్థ చైర్మన్ సెహగల్ కొత్త భవనాన్ని ప్రారంభించారు. రూ.27 లక్షలతో బీసీ హాస్టల్ భవనాన్ని చక్కగా, ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారు.



శివ్వంపేట మార్కెట్‌లో జనం రద్దీ

'పబ్లిక్' పరేషాన్

● శివ్వంపేటలో పబ్లిక్ టాయిలెట్స్ కరువు
● అవస్థలు పడుతున్న ప్రజలు

శివ్వంపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన శివ్వంపేటలో పబ్లిక్ టాయిలెట్లు, మరుగుదొడ్లు లేక జనం తీవ్ర అవస్థలు పడుతున్నారు. 37 గ్రామ పంచాయితీలు, 57 గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం, ప్రతీ బుధవారం నిర్వహించే వారాంతపు సంతకు మండల కేంద్రానికి వస్తుంటారు. దీంతో శివ్వంపేట నిత్యం జనంతో రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో టాయిలెట్స్ సౌకర్యం లేక విద్యార్థులు, ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రధానంగా మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పురుషులు స్థానిక ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీకి మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా కంపు కొడుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పబ్లిక్ టాయిలెట్స్, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మెదక్ జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీ సీతా రామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. రాత్రి స్వామి వారి దివ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.
-మెదక్ అర్బన్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి)



అల్లాదుర్గం, (ఆంధ్రజ్యోతి) : మండలం ముస్లాపూర్‌లోని దుర్గాభవాని జాతరలో బండ్ల ఊరేగింపు

ఎంఆర్ఐ, స్కానింగ్ సౌకర్యాలు కల్పించండి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఆర్ఐ, స్కానింగ్, సిటీ స్కానింగ్ యంత్రాలు, నిపుణుల సంఖ్యను పెంచాలని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఫోరం కార్యదర్శి మహేష్‌కుమార్, జగద్గురు, రవిదాస్, రాజు, సుమన్ తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ

గుమ్మడిదల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండల నూతన తహసీల్దారుగా పరమేశం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గుమ్మడిదల మండలంలోని వివిధ రేషన్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగితే సహించేదీలేదని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఆయన వెంట వెంట ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

62వ రోజు రిలే నిరాహార దీక్ష

గుమ్మడిదల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నల్లవల్లి, ప్యారానగర్‌లో డంపుయార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా గుమ్మడిదల మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 62వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం చేపట్టిన దీక్షలో మండల జేఏసీ సభ్యులు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, ఆకుల సత్యనారాయణ, ఉదయ్‌కుమార్, భిక్షపతి రెడ్డి, సూర్యనారాయణ, భీమ్‌రెడ్డి, మంద భాస్కర్ రెడ్డి, జె.బాల్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ఆంజనేయులు, వేణుగోపాల్ రెడ్డి, నల్తూరుయాదగిరి, కుంటి మల్లేశ్, ఆయుబ్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

నారాయణఖేడ్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ మార్ట్‌లో సోమవారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిణి శ్రీశిక తనిఖీలు నిర్వహించారు. రెండు రోజుల క్రితం ఒక వినియోగదారుడు కొనుగోలు చేసిన ఇడ్లీరవ్వలో పురుగులు వచ్చాయని అధికారులకు ఫిర్యాదు చేయగా, తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ సేకరించారు. తనిఖీ నివేదికను జిల్లా అధికారులకు అందిస్తానని ఆమె తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అల్లాదుర్గం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో అధికారులు శేఖర్, బాలరాజు కోరారు. ఖేడ్ డిపో మేనేజరు మల్లేశయ్య ఆదేశాల మేరకు సోమవారం అల్లాదుర్గంలోని ఐకేపీ కార్యాలయంలో దివ్యాంగుల బస్ పాస్ మేళా నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన 16 మందికి బస్ పాసులను అందజేశారు. నేడు కూడా బస్ పాస్ మేళా ఉంటుందని వారు తెలిపారు.

క్షేత్రస్థాయి పరిశీలనతోనే అనుభవం : ఎంఈవో

జహీరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయి పరిశీలనతోనే మరింత అనుభవం వస్తుందని వ్యవసాయశాఖ ఏఈవో ప్రదీప్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని రంజోల్ గ్రామంలో భాగస్వామ్య గ్రామీణ అనుభవ నిర్వాహణ(పీఆర్ఏ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన పొలాలు, గ్రామం, వ్యవసాయ భూముల రకాలు తదితరాలను మ్యాప్ వేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

జహీరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సమన్వయంతో పని చేద్దామని తహసీల్దార్ దశరత్ పేర్కొన్నారు. సోమవారం కార్యాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. అందరం కలిసి సంఘటితంగా పనిచేస్తే ఎవ్వరికీ ఇబ్బందులు ఉండవన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్టరేట్ ముట్టడి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉన్న భూములు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఇళ్ల స్థలాలు, ఉపాధి హామీ, రోడ్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ.. పైన పేర్కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి పత్రం అందజేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నిజాంపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నిజాంపేటలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ గణేష్ తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మనోహరాబాద్ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా సీఐటీయూ కార్యదర్శి ఆసిఫ్ అన్నారు. ఈ మేరకు మనోహరాబాద్ మండల కేంద్రంలో కార్మికులతో కలిసి పంచాయతీ కార్యదర్శి రూపగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీపీ కార్మికులకు ఇచ్చిన మాటను తప్పిందన్నారు. ఇప్పటికైనా వారి డిమాండ్లను నెరవేర్చాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చేగుంట ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్ సోమవారం అందజేశారు.